


# పువ్వులు పోడూరి వెంకటరమణ శర్మ

విఐటి వెల్లూరు లో బె టెక్ ఫైనల్ పరీక్షలు రాసి సెలవలకి హైదరాబాద్ ఇంటికి వచ్చాను. ఇంటికి రాగానే అమ్మ చెప్పింది, రెండు రోజులలో రాజు మావయ్య వస్తున్నాడని. చాలా ఆనంద మేసింది. మా అమ్మ అయిదుగురు అప్ప చెల్లెళ్లకి రాజు మావయ్య తప్ప మిగతా అన్న దమ్ములు ఎవరూ లేరు. చిన్నప్పుడు, రాజు మావయ్య వస్తున్నాడంటే మా పిల్లలందరికీ చాలా ఉత్సాహం. పిల్ల లందరికీ ఎదో ఒక ప్రత్యేకమయిన స్వీట్ పట్టుకు వచ్చేవాడు. చిన్నప్పుడు వేసవి సెలవలకి తాతగారి ఊరు వీరవాసరం వెళ్ళడానికి పెద్ద అట్రాక్షన్ రాజు మావయ్యే. ఆయన కూడా పిల్లలతో సెలవలకి వీరవాసరం వచ్చేవాడు పిల్లలన్దరినీ చేరదీసి రకరకాల ఆటలు ఆడించే వాడు. ఒక్కొక్కప్పుడు ఒక్కొక్కళ్ళని వెంటపెట్టుకుని తోటల్లోకి తీసుకు వెళ్ళేవాడు. కూడా వెళ్ళడానికి మేము ఒకళ్ళతో ఒకళ్ళం పోటీ పడుతూ ఉండేవాళ్ళం.

నాన్నగారికి తరుచు బదిలీలు ఉండడం, తాను ఢిల్లీ లో సెటిల్ అవడంతో మాకు జ్ఞాన మొచ్చిన తరువాత ఆయన తో ఎక్కువ రోజులు గడిపింది తక్కువే. చిన్నప్పుడు ఆయన ఏపని చెప్పినా చేయడానికి అందరం పోటీ పడుతూ ఉండేవాళ్ళం. మా చేత అలా పనులు చేయించడంలో ఆయన చిట్కా అప్పుడు మాకు తెలియదు.

నాన్నగారు నన్ను స్టేషన్ కి వెళ్ళమంటే నేను వెళ్లి రాజు మావయ్యని రిసీవ్ చేసుకున్నాను. ఆటో అతను చాలా రద్దీ గా ఉన్న ట్రాఫిక్ లోంచి సడన్ బ్రేకులు వేసి ఏ వెహికిల్ కీ గుద్దించ కుండా స్పీడ్ గా నడపడం మావయ్యకి చాలా ఆశ్చర్య మేసింది . ఇలాంటి స్కిల్ ఎక్కడా చూడం అని, ఆటో అతని తో కూడా మాట కలిపి అతన్ని అభినందించాడు. దారిలో ఏటీఎం దగ్గర ఒక సారీ, పుల్లారెడ్డి స్వీట్ షాప్ దగ్గర ఇంకోసారీ ఆటో ఆపి పనులు చేసుకున్నా ఆటో అతను ఏమీ విసుక్కోక పోవడం నాకు ఆశ్చర్యమే. ఇంటికి చేరిన తరువాత మావయ్య సూట్ కేసు ఆటో లోంచి తీస్తోంటే, ఆటో అతను అందుకొని లోపలిదాకా తీసుకు వచ్చి పెట్టాడు. హైదరాబాద్ లో ఆటో అతను ఆ పని చేయడం నాకు నిజంగా వింతే.

భోజనాలు అయిన తరువాత అమ్మతో కబుర్లలో పడ్డాడు మావయ్య. మయంలో నన్ను పిలిచీ " ఒరేయి ఎల్లుండికి నర్సాపూర్ ఎక్స్ప్రెస్ లో వీరవాసరానికి కి రెండు టిక్కెట్లు ఉన్నాయేమో చూడు, నువ్వు కూడా నాతో వద్దువు గాని" అన్నాడు అమ్మకేసి వాడు రావడం అభ్యన్తరం లేదుగా అన్నట్టు చూస్తూ

"వీరవాసరం వెళ్లాలా ?" అంది అమ్మ కుతూహలంగా

" అవునే, ఆ మధ్యన మన ఇంటి పక్కన ఉన్న స్థలం కొన్నాము కదా? దానిలో ఎవడో రాటలు పాతాడట. కోర్టు లో కేసు వెయ్యాలి అని చెప్పాడు మన పొలాలు చూసే రామభద్రం. ముందు అక్కడికి వెళ్లి చూసి భీమవరం లో కోర్టు లో వెయ్యాలి. భీమవరం లో రెండు రోజులు ఉండాలేమో" అన్నాడు మావయ్య ప్రయాణం కారణం చెబుతూ

" భీమవరం లో మన నరుసులు పిన్ని కొడుకు మాధవ ఉన్నాడు. వాళ్ళ ఇల్లు పెద్దదే. అక్కడ దిగు. వాడూ సంతోష పడతాడు" అంది అమ్మ.

" మామూలు గా దొరక్క పోతే తత్కాల్ అయినా చూడరా. లోయర్ బెర్తు పెట్టు. మోకాళ్ళ ప్రాబ్లెమ్ తో పైకి ఎక్క లేను " అన్నాడు కార్డు పర్సు లోంచి తీసి ఇచ్చి.

మావయ్య భయ పడ్డట్టే లోయర్ బెర్త్ దొరకలేదు. ఒకటి మిడిల్, ఒకటి అప్పర్ దొరికాయి.

★★★★

ట్రైన్ టైంకి కొంచం ముందుగానే స్టేషన్ చేరుకున్నాము. స్టేషన్ లో బండి పెట్టగానే, ఎక్కి సామాను సద్ది మా సీట్లలో కూర్చున్నాం. అప్పటికి మా సెక్షన్ లో ఉన్న ఆరు సీట్లకి, మేమిద్దరమే ఎక్కాము. "ఎవరినయినా లోయర్ బెర్త్ రేక్వెస్ట్ చేద్దామా మావయ్యా అన్నాను." " చూద్దాం లే, వచ్చిన వాళ్ళు మనకంటే వాళ్ళకే అవసరమయితే ఏమి అడుగుతాము?" అన్నాడు మావయ్య

కొద్దీ సేపటికి ఒక నడి వయసు వ్యక్తి, భార్య, ఇద్దరు పిల్లలతో వచ్చి మా ఎదురుగా కూర్చున్నారు. వాళ్ళకి కొంచం సామాను ఎక్కువగా ఉంది. ఆయన వాటిని సద్దుకోవడం లో సతమత మవుతోంటే, మావయ్య లేచి, మా సామాను కూడా జరిపి, వాళ్ళ సామాను సర్దడం లో సహాయం చేశాడు.

వాళ్ళ ఇద్దరు పిల్లలలో, అబ్బాయికి ఏడూ, అమ్మాయికి ఒకటో, ఒకటిన్నరో ఉంటాయి అనుకుంటా. అబ్బాయి కి కళ్ళజోడు. వాడు ఏదో బొమ్మల పుస్తకం చూసుకుంటున్నాడు. అమ్మాయి మాత్రం ఉండుండి ఏడుస్తోంది. ఎందుకు ఏడుస్తోందో ఆవిడకి అర్థం కాక సతమత మవుతోంది. కాసేపు పరిశీలించి, ఆ అమ్మాయిని ఇవ్వమని మావయ్య ఎత్తుకున్నాడు. మావయ్య చేతుల్లో కూడా ఊరు కొక పోతే, ఆ పిల్ల దృష్టి మరల్చడానికి రెండుచేతులతో పైకి ఎత్తినప్పుడు, ఆ పిల్ల కాలికి ఉన్న వెండి పెట్టా హుక్కు దగ్గర, రేకులాటిది ఆ పిల్లకి గుచ్చుకోవడం చూశాడు. అది ఆవిడకి చూపించి ఆపట్టా తీసేయిస్తే ఆ పిల్ల ఊరుకుంది.

ఆవిడ భోజనాలు కెరీయర్ లో సర్దుకు వచ్చింది. భర్తకీ పిల్లలకి పెట్ట బోతూ, మాకు కూడా ఆఫర్ చేసింది. " లేదండి తెచ్చుకున్నాము" అని మేము స్టేషన్లో కట్టించిన ప్యాకెట్లు విప్పాము

భోజనాలు అయిన తరువాత " పవర్ ఎక్కువగా ఉన్నట్టుందే! అబ్బాయికి ఎప్పటినుంచీ కళ్ళజోడు అవసరమైంది సార్ ? సైట్ ఉన్నట్టు ఎలా తెలిసింది?"మావయ్య ఆయనని అడిగాడు

" అవునండీ మైనెస్ అయిదు. కాన్వెంట్ వాళ్ళు అందరికీ మెడికల్ చకప్ చేయించినప్పుడు తెలిసింది" అన్నాడు ఆయన

" ఇంత చిన్న వయసులో వచ్చినప్పుడు రెండేళ్లకోమాటు జంప్ ఆయె అవకాశం ఉంది. పాండిచ్చేరి అరబిందో ఆశ్రమం వాళ్ళు ఒక ఎక్సర్సైజ్ చెప్పి, కిట్ ఇస్తారు. మా అబ్బాయిని తీసుకువెళ్లాను. కొద్దిగా ఉపయోగపడింది. ఇంకా చిన్నవయసులో అయితే ఎక్కువ ఉపయోగపడేది అన్నారు. మీవాడు చాలా చిన్నవాడు కాబట్టి ఒక మాటు తీసుకు వెళ్ళండి " అన్నాడు మావయ్య సలహా ఇస్తూ.

" తప్పకుండా తీసుకువెడతామండి" అంది ఆవిడ ఉత్సాహంగా. వాళ్ళని ఎలా కాంటాక్ట్ చేయాలో మావయ్య ఆయనకి వివరించాడు.

కాసేపు కబుర్లు అయిన తరువాత " మెల్లిగా పైకి ఎక్కుదాము రా, మోకాళ్ళు నెప్పులయినా, తప్పదు కదా?" అన్నాడు మావయ్య లేస్తూ

" క్రింద రెండు బెర్తులూ మావే. మీరు ఒకటి తీసుకోండి." అంది ఆవిడ మొహమాటానికి కాకుండా, సిన్సియర్ గానే

" మీకు ఇబ్బందేమో? " అన్నాడు మావయ్య సందేహిస్తూ

" లేదండి, పిల్లాడూ, ఆయన పైకి వెడతారు ఏమీ ఫరవాలేదు" అని భర్త కేసి చూసింది. ఆయన వెంటనే " ఏమీ ప్రోబ్లం లేదండి " అని అంగీకారం తెలపడంతో మావయ్య బెర్త్ ప్రోబ్లం సాల్వ్ అయింది.

నేను నా బెర్త్ మీదకి ఎక్కుతూ మావయ్య 'చిట్కా' గురించి నాకు కొంత అవగాహన కలుగుతోందేమో అనుకున్నాను.

★★★★

వీరవాసరం లో దిగి తాతయ్య గారి ఇంటికి చేరేటప్పటికి ఉదయం ఎనిమిదయింది. రామభద్రం ఇల్లు కాస్త శుభ్రం చేయించి ఉంచాడు. అమ్మమ్మ, తాత గారు పోయిన తరువాత, ఆ ఇంట్లో ఎవరూ ఉండటం లేదు. ఎప్పుడయినా భూములు చూసుకోవడానికి రాజు మావయ్య వస్తే ఉండడానికి వీలుగా కొద్దీ పాటి సామాను తో మూడు గదులు నివాసయోగ్యంగ చేశాడు రామభద్రం. మిగతా ఇల్లు అంతా చాలా పాడుపడి పోయింది. ఇల్లు మెయిన్ రోడ్డు మీద ఉండడంతో డెవెలప్ మెంట్ కి అడుగుతున్నారు. ఆ ఇంటి స్థలంతో కలిపి అమ్మితే ఎక్కువ రేటు వస్తుందని పక్క స్థలం కొన్నాడు మావయ్య. అనుకున్నట్టు గానే ఇప్పుడు రేట్లు బాగా పెరిగాయి. అందువల్లే అవతల పక్క మందుల షాపు వాడు కొంత స్థలం కలుపుకోవడానికి ఏదో లిటిగేషన్ పెట్టాడు.

రామభద్రం పంపించిన భోజనాలు చేసి ఒక కునుకు తీశాము . మధ్యాహ్నం, రామభద్రం ఎవరో మధ్యవర్తులని తీసుకు వచ్చాడు రాజీ కుదర్చడానికి. వెళ్ళిపోతూ వాళ్ళల్లో ఒకాయన రాజయ్య గారు వెనక్కి వచ్చి సలహా ఇచ్చాడు . ఆయనకి తాత గారు ఎప్పుడో చాలా సహాయం చేశారట. ఆయన అనేదేమిటంటే, రాజు మావయ్య ఢిల్లీ లో ఉండి లిటిగేషన్ నడపలేడనీ , కోర్టుల చుట్టూ తిరగలేడనీ మొత్తం ఇల్లు తో సహా స్థలాన్ని, కొంత కాలం లిటిగేషన్ నడిపి తక్కువ రేటుకి తానే కొనేద్దామనే ఉద్దేశ్యంతో పక్క మెడికల్ షాపు రోశయ్య ఇదంతా లేవదీశాడనీ చెప్పాడు. అందుచేత రాజీ ఏమి పడకుండా కోర్టులో వెయ్యమని చెప్పాడు. ఇక్కడ లాయర్ కాకుండా, భీమవరం లో ఉన్న ఎవరయినా మంచి లాయర్ని పెట్టి కేసు వేయమన్నాడు. తాను చేయవలసిన సహాయం చేస్తానన్నాడు.

ఆ సాయంత్రం భీమవరం మాధవ్ మావయ్య ఇంటికి బయలుదేరాము. దారిలో మావయ్య చెప్పాడు. చిన్నప్పుడు మాధవ్ మావయ్య వీరవాసరం లో తాతగారి ఇంట్లో ఉండి చదువుకున్నాడట. మావయ్య కంటే కొద్దిగా సీనియర్. చాలా విషయాలలో " ఒరేయి మాధవ ని చూసి నేర్చుకోరా" అని మావయ్యతో అనేదట అమ్మమ్మ . ప్రొద్దుటే లేవడం, తన పనులు తాను చేసుకోవడం, శ్రద్ధ గా చదువుకోవడం లాంటి అన్ని విషయాలలో మావయ్యకంటే మెరుగట. వాడు మిలిటరీ సర్వీస్ కి వెళ్లడం వల్ల చూసి చాలా చాలా రోజులయింది అన్నాడు.

భీమవరం లో ఒక పెద్ద అపార్ట్మెంట్ కాంప్లెక్ పక్కన ఒక చిన్న కాంపౌండ్ లో ఇండిపెండెంట్ హౌస్ వాళ్ళది. వీధివైపు వున్న రెండు కిటికీల షేడ్స్ మీద రెండేసి పూలకుండీలు, కిందకి వేళ్ళాడుతున్న పూల తీగలతో చాలా అందాన్నిచ్చాయి. కాంపౌండ్ వాల్ కీ ఇంటికీ మధ్య లోపలికి వెళ్ళే దారికి ఇరు పక్కలా గులాబీ మొక్కలు పూల తో నిండి ఉన్నాయి.

మాధవ్ మావయ్య చాలా ఆప్యాయంగా రిసీవ్ చేసుకున్నాడు. ఆయన, అత్తయ్యా , ఇద్దరే ఉంటున్నారు. వాళ్ళ అమ్మాయి పెళ్లి అయి, దుబాయిలో ఉంటోందని తెలిసింది.

"ఎలా ఉన్నారు వదినగారు. ఎప్పుడో సుబ్బులు పిన్ని కూతురు రాజ్యం పెళ్ళిలో కలిశాము. మళ్ళీ ఇప్పుడు. నన్ను మరిచి పోయి ఉంటారు" అన్నాడు రాజు మావయ్య అత్తయ్యని పలకరిస్తూ. " మా పెద్దక్క కొడుకు చంద్రం " అని నన్ను పరిచయం చేశాడు . బాగా మారిపోయాననీ ఎప్పుడో చిన్నప్పుడు చూశానని చెప్పి లోపలికి వెళ్ళింది అత్తయ్య

హాలులో సోఫాలలో కూర్చున్నాము. " యూరప్ లో చాలా ఇళ్లల్లో కిటికీ షేడ్ల మీద పువ్వుల కుండీలు, కుండీలు కనపడకుండా తీగలు క్రిందకి వాలుతూ ఉంటాయి. అచ్చం అలాగే ఉన్నాయి మీ ఇంటి ముందు. చాలా బాగా పెంచావే" అన్నాడు రాజు మావయ్య మెచ్చుకుంటూ

" మనదేమీ లేదురా, అన్నీ మీ వదిన ఐడియాలే. సినిమాలలో చూసి చేసినవే. పువ్వులు కూడా కోయదు. గులాబీలు చూశావు కదా? అవి అక్కడే ఉండాలి అంటుంది" భార్య గురించి చెబుతుంటే ఆయన కళ్ళల్లో కొంచం గర్వం తొణికసలాడడం నేను గమనించాను

ఇంతలో అత్తయ్య కాఫీలు తెచ్చింది. అందరం మెల్లిగా తాగుతున్నాము. "నీ పూల మొక్కలనీ, కుండీలనీ మెచ్చుకుంటున్నాడు రాజు " అన్నాడు మావయ్య భార్యతో. ఆవిడ నవ్వి ఊరుకుంది

" అద్భుతం! ఇలాంటి ఫిల్టర్ కాఫీ ఈ మధ్యన తాగలేదు. ఎరా చంద్రం మీ వెల్లూర్ లో ఇలాంటిది ఎప్పుడయినా తాగావా? అన్నాడు రాజు మావయ్య నాకేసి చూసి

"కుంభకోణం డిగ్రీ కాఫీ అని ఫిల్టర్ కాఫీ ఉంటుంది కానీ. దానికంటే ఇది చాలా బాగుంది" అన్నాను అత్తయ్యకేసి మెచ్చుకోలు గా చూసి.

రాజు మావయ్య, మేము వచ్చిన పని చెప్పాడు మాధవ్ మావయ్యకి. తనకి తెలిసిన అడ్వొకేట్ ఉన్నాడనీ అతని దగ్గరకి ప్రొద్దుటే వెడదామని చెప్పాడు

డ్రాయింగ్ రూమ్ కి ఎడమవైపుగా ఉన్న బెడ్ రూమ్ మాకు ఉండడానికి ఏర్పాటు చేశారు. కొంచం ఉక్క గా ఉందని, ఇద్దరం స్నానాలు చేసి రెడీ అయ్యాము. రాజు మావయ్య ఎవరో చిన్నప్పటి క్లాస్ మేట్ ఉన్నాడని, అతనిని కలిసి వస్తానని వెళ్ళాడు. నేను అత్తయ్య తో కబుర్లలో పడ్డాను.

రాత్రి ఎనిమిదింటికి రాజు మావయ్య తిరిగి రాగానే డైనింగ్ టేబుల్ దగ్గర ముగ్గురికీ వడ్డించింది. చాలా పదార్థాలు చేసింది అత్తయ్య.

కూర్చుంటూనే అన్నాడు రాజు మావయ్య " ఏమిటి ఇన్ని ఐటెమ్స్ చేశారు వదిన గారు". నవ్వుతూ "ఆ ఏమున్నాయి?మామూలుగా చేసేవే" అంది ఆవిడ

భోజనాలు చేస్తుంటే, ఏ ఐటెం ఎవరు తింటున్నారో చూసి అవి మళ్ళీ వడ్డించడానికి తేవడం లో ఆవిడ శ్రద్ధ నాకు బాగా నచ్చింది

కొబ్బరి కాయతోటి, శనగపప్పు తోటీ రెండు మూడు ఐటెంలు చేసింది ఆవిడ. అవి రుచి చూసి "ఇవి ఎప్పుడూ తిన లేదే, చాలా బాగున్నాయి" అన్నాడు మెచ్చుకుంటూ రాజు మావయ్య.

" ఆ రెండూ మీ వదిన స్పెషల్స్ రా ఎవరు తిన్నా రెసిపీ తెలుసుకుని వెడతారు" అన్నాడు కొంచం గర్వంగా మాధవ్ మావయ్య.

భోజనాలు అయిన తరువాత ఒక పళ్లెం లో పళ్ళ ముక్కలు, ఆ తరువాత వేరే పళ్లెంలో తమల పాలకులు, వక్క[పొడి, వలిచిన ఏలకులు నీట్ గా అమర్చడం–, ఇలా రాత్రి పడుకునే దాకా అత్తయ్య చేసిన వాటిని రాజుమావయ్య మెచ్చుకోవడం, దానికి మాధవ్ మావయ్య ఆనంద పడడం నాకు తెలుస్తూనే ఉంది.

మరునాడు ప్రొద్దుటే మమ్మలిని ఇద్దరినీ అడ్వకెట్ దగ్గరికి తీసుకు వెళ్ళాడు మాధవ్ మావయ్య. ఆయనకి మొత్తం అంతా చెప్పి, అవసరమయితే వీరవాసరంలో ఉన్న రాజయ్య సహాయం చేస్తాడని చెప్పాడు మావయ్య. కాగితాలు అన్నీ రెడీ చేసి వకాలత్ మీదా, మిగతా వాటి మీద సంతకం పెట్టించుకున్నాడు అడ్వొకేట్. మేము తిరిగి వస్తోంటే " మీరు ఎక్కడో ఢిల్లీ నుంచి తరచు రావడం కుదరదు కాబట్టి. ఇక్కడ ఎవరికయినా పవర్ ఇచ్చి. రాజయ్యని కూడా ఆ ఊళ్ళో వాళ్ళ సాక్ష్యం కోసం కలుపుకోవడం మంచిది అన్నాడు" అన్నాడు అడ్వొకేట్.

అలాగే ట్రై చేస్తానండి అని మావయ్య అనగానే " నా పేర పవర్ కి కాగితాలు తయారుచేయండి సార్,నేను ఇక్కడ ఉన్నాను కదా?, రాజయ్య నాకూ తెలుసు, అక్కడ వాళ్లందరితో నేను మాట్లాడుతా, చాలా అవసరమయినప్పుడే రాజుని పిలిపిద్దాము" అన్నాడు మాధవ్ మావయ్య

రాజు మావయ్య ఆయన చేతులు పట్టుకుని " చాలా థాంక్స్ రా. నీకు శ్రమ అవుతుందేమో" అన్నాడు కృతజ్ఞత ముఖం లో ప్రస్ఫూట మవుతుండగా

" భలేవాడివే ఆ మాత్రం మనకి మనం చేసుకోవడం లో ఏముంది? " అన్నాడు నవ్వుతూ. దానికి సంబంధించిన పేపర్స్ కూడా సంతకాలు అయిన తరువాత బయలు దేరి వచ్చేశాము.

రాత్రికి ట్రైన్ లో తినడానికి అత్తయ్య ఇచ్చిన ప్యాకెట్లు కూడా తీసుకుని స్టేషన్కి బయలు దేరాం. " ఈ మాటు వచ్చేటప్పుడు, మా చెచెల్లెలిని కూడా తీసు రా తప్పకుండా" అంది అత్తయ్య రాజు మావయ్యతో, సాగనంపడానికి గుమ్మం దాకా వచ్చి.

" తప్ప కుండా, మీ దగ్గర నేర్పించవలసినవి చాలా ఉన్నాయి" అన్నాడు నవ్వుతూ మాధవ్ మావయ్య కేసి చూస్తూ. ఆయన కూడా ఆనందంగ నవ్వేడు.

★★★

తిరుగు ప్రయాణం లో ఇద్దరికీ లోయర్ బెర్తులే రావడంతో ప్రాబ్లెమ్ లేకపోయింది. బ్యాగులు సద్ది సీట్లలో సెటిల్ అయిన తరువాత అప్పటి వరకూ నన్ను దొలుస్తున్న "మావయ్య చిట్కా" విషయం మనసులో పైకి వచ్చింది. హైదెరాబాద్ లో స్టేషన్ నుంచి తీసుకువచ్చిన ఆటో వాడి దగ్గరనుంచి, ట్రైన్లో బెర్త్ ఆఫర్ చేసిన కుటుంబం, భీమవరం లో మాధవ్ మావయ్య కోర్టు కేసు సహాయానికి ఆఫర్, అన్నీ ఒక్క మాటు గుర్తుకు వచ్చాయి. ఆటో వాడిని పొగడడం, ట్రైన్ లో వాళ్లకి సహాయం చేయడం, అత్తయ్యని పొగడడం ద్వారా మాధవ్ మావయ్యని ఆనంద పరచడం, ఇవన్నీ ఒక

ఫలితాన్ని ఆశించి ప్లాన్ ప్రకారం జరిగాయా, లేక సహజంగా మావయ్య వ్యక్తిత్వం లో ఉన్న మంచితతనం వల్ల జరిగాయా అన్న విషయం నాకు సందేహం గానే మిగిలిపోయింది.

మనసులో పీక్కోవడం దేనికి? మావయ్యనే అడిగేద్దాం అనుకుని ఆయనతో నా మనసులో వచ్చిన ప్రశ్న గురించి చెప్పాను.

ఆయన " సహజంగా చెట్టుకు పూసిన మల్లెపూల నుంచి వచ్చే సువాసన ఆహ్లాద పరిచినట్టు, ఎంత అందంగా ఉన్నా ప్లాస్టిక్ పూలు ఆహ్లాద పరచవుకదరా " అన్నాడు నవ్వుతూ

మర్నాడు ప్రొద్దున్న హైదరాబాద్ రైట్ టైం కె చేరింది ట్రైన్. ఇంటికి వెళ్లి స్నానాలు చేసి, డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నాము. అమ్మ ఇద్దరికీ కాఫీ తెచ్చి ఇచ్చింది. కాఫీ సిప్ చేస్తూ అన్నాడు మవయ్య "అక్కయ్యా మన చంద్రం ఈ రెండురోజుల ట్రిప్ లో చాలా హెల్ప్ ఫుల్ గా ఉన్నాడు. నాకేమీ శ్రమ లేకుండా అన్నీ తా నే మానేజ్ చేశాడు" అన్నాడు నవ్వుతూ

" నాకు మల్లి పూల వాసన వేస్తోంది మావయ్యా " అన్నాను నవ్వుతూ. ఆయనకి అర్థ మయింది

"నేను ప్లాస్టిక్ పువ్వును కాదు కాదురా " అన్నాడు నవ్వుతూ

ఆ జవాబు కి నాకుకూడా పెద్దగా నవ్వు వచ్చింది

ఇద్దరం ఎందుకు నవ్వుకుంటున్నామో అర్థం కాక అమ్మ ఆశ్చర్యంగా చూస్తూ నిలబడి పోయింది

★★★★★★★

Click here to share your comments on this story